క్లుప్తంగా

రామచంద్రస్వామికి ప్రత్యేక పూజలు



నరసింహారావుపాలెం(వీరులపాడు):గ్రామంలో వేంచేసి ఉన్న కోదండ రామచంద్ర స్వామి జీర్ణోద్ధరణ జీవధ్వజస్తంభ పునఃప్రతిష్ట మహోత్సవం శుక్రవారం పరాంకుశం వాసు దేవాచార్యులు పర్యవేక్షణలో నిర్వహిస్తామని అలయ అర్చకులు భరత్ కుమార్, రాజేష్‌కుమార్ తెలిపారు. దేవాలయ అవరణలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి ఉదయం మహిళలు జలబిందెలచే గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. సర్పంచ్ బొమ్మిశెట్టి దుర్గాదేవి, కంచికచర్ల మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ బొమ్మిశెట్టి భాస్కరరావు, ప్రవాసాంధ్రుడు యేదురు విజయభాస్కర్‌రెడ్డి, అన్నపూర్ణమ్మ ఎంపీటీసీ సభ్యుడు శీలం రమణారెడ్డి, అర్చకులు వంశీ, పవన్‌కుమార్, జానకిరామ్ తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షం... రైతుల్లో ఆందోళన

నందిగామ: నందిగామ ప్రాంతంలో గురువారం మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. సాయంత్రం నాలుగు గంటల సమయంలో కారు మేఘాలతో కూడిన ఈదురు గాలులు విచాయి. పలుచోట్ల ఒక మోస్తరు వర్షం కురిసింది. దీనికి తోడు వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ అధికారుల హెచ్చరికలతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే కోతలు కోసి కల్లాల్లో ఉన్న మిర్చి తడవకుండా కాపాడుకునేందుకు రక్షణ కవచాలుగా పరదా పటలను ఏర్పాటు చేశారు. భారీ వర్షం కురిస్తే కల్లాల్లోని మిర్చి దెబ్బతింటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

థాంక్యూ సీఎం సార్



నందిగామ:డీఎస్సీ అభ్యర్థుల సమస్యను పరిష్కరించిన రాష్ట్ర ముఖ్యమంత్రికి వేలాది కుటుంబాలు జీవితాంతం రుణపడి ఉంటాయని విశ్రాంత ఉద్యోగి ఎంవై దాసు పేర్కొన్నారు. 1998 డీఎస్సీ అభ్యర్థులకు ప్రభుత్వం శుభవార్త చెప్పిన నేపథ్యంలో గురువారం నందిగామ పట్టణంలో థాంక్యూ సీఎం సార్... నినాదంతో కూడిన ఫ్లెక్సీలు పట్టుకొని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ 1998 నుంచి ఎదురుచూస్తున్న డీఎస్సీ అభ్యర్థుల 25 సంవత్సరాల కల నెరవేరిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 4,534 మంది సెకండ్ గ్రేడ్ టీచర్లుగా ఉద్యోగాలు లభించనున్నాయన్నారు. వారి కుటుంబాలు జీవితాంతం ప్రభుత్వానికి రుణపడి ఉంటాయన్నారు. పిల్లి జయరాజు, దాదా హుస్సేన్, చిరుమామిళ్ల చైతన్య కుమార్, బాలసరోజా తదితరులు పాల్గొన్నారు.

కరెంట్ షాక్‌తో హెల్పర్‌కు తీవ్ర గాయాలు



నవాబుపేట(పెనుగంచిప్రోలు):కరెంట్ షాక్‌తో హెల్పర్‌కు తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని నవాబుపేట గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కరెంట్ హెల్పర్ బొజ్జా వెంకటేశ్వరరావు పని నిమిత్తం విద్యుత్ స్తంభం ఎక్కగా తీగలు తగిలి షాక్‌కు గురై కిందపడిపోయాడు. ప్రమాదంలో ఆయన శరీరం కాలింది. బాధితుడిని మొదట నందిగామ ప్రభుత్వాసుపత్రికి అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయవాడ తరలించారు.

ఉరేసుకుని వ్యక్తి మృతి

నందిగామ:ఉరి వేసుకుని వ్యక్తి మృతి చెందిన ఘటన గురువారం నందిగామ లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం... పట్టణంలోని ప్రైవేటు కూరగాయల మార్కెట్ లో వ్యాపారం చేసే బండి రామకృష్ణ (45) ఇంట్లో ఫ్యానుకు ఉరి వేసుకున్నాడు. వెంటనే కుటుంబ సభ్యులు, స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారణ చేశారు. ఘటనపై తమకు పూర్తి సమాచారం రావాల్సి ఉందని ఎస్సై పండు దొర తెలిపారు.

అభివృద్ధి పనుల పరిశీలన



భవానీపురం: భవానీపురం పున్నమిఘాట్ వద్ద చేయాల్సిన అభివృద్ధి పనులను పరిశీలించడానికి ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, వివిధ విభాగాల అధికారులతో కలిసి గురువారం పర్యటించారు. పున్నమిఘాట్ పరిసర ప్రాంతాల్లో ఉన్న విద్యుద్దీపాలను ఆధునీకరించి నదీ తీర ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచడానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సందర్శకులకు ఇబ్బంది లేకుండా అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేయాలన్నారు.

పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిది

నందిగామ:మదరాసీయుల పాలనలో అవమానాలు ఎదుర్కొంటున్న తెలుగు ప్రజల విముక్తి కోసం ప్రాణ త్యాగం చేసి భాషా ప్రాతిపదికన తొలి రాష్ట్రాన్ని సాధించిన మహనీయుడు అమరజీవి పొట్టి శ్రీరాములు అని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు కొనియాడారు. నియోజకవర్గ వ్యాప్తంగా గురువారం అమరజీవి 122 వ జయంతి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక గాంధీ సెంటర్ లోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఎమ్మెల్యే తోపాటు పలువురు నాయకులు క్షీరాభిషేకం చేయడంతో పాటు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు భాష మాట్లాడే వారికి ప్రత్యేక రాష్ట్రం కావాలంటూ నినదించి ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆమరణ దీక్ష చేపట్టిన త్యాగమూర్తి శ్రీరాములు అని శ్లాఘించారు. బళ్ళారి రాఘవ కళా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బొబ్బిళ్ళపాటి గోపాలకృష్ణ సాయి, మార్కెట్ యార్డ్ చైర్మన్ మహమ్మద్ మస్తాన్, వైస్ చైర్మన్ నల్లమల్లి మురళి, పట్టణ పార్టీ కన్వీనర్ దొంతిరెడ్డి దేవేందర్ రెడ్డి, కౌన్సిలర్ మారం అమరయ్య, పాకాలపాటి కిరణ్ తదితరులు పాల్గొన్నారు. నగర పంచాయతీ కార్యాలయంలో అమరజీవి చిత్రపటానికి కమిషనర్ డాక్టర్ జయరాం పూలమాలలు వేసి నివాళులర్పించారు.

చందర్లపాడు మండల పరిధిలోని అన్ని పాఠశాలల్లో అమరజీవి జయంతి ఘనంగా నిర్వహించారు. ముందుగా శ్రీరాములు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ గాంధీ, జెడ్పీటీసీ నాగమణి తదితరులు



పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న సర్పంచ్ పద్మకుమారి



పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న తహసీల్దార్ లక్ష్మీకల్యాణి తదితరులు

పెద్దాపురం(వీరులపాడు):ప్రత్యేక రాష్ట్ర సాధనకు అమరజీవి పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగం చేశారని ఎంపీపీ కోటేరు లక్ష్మీ పేర్కొన్నారు. మండలంలోని పెద్దాపురం గ్రామంలో అమరజీవి జయతిని గురువారం నిర్వహించారు. ముందుగా అమరజీవి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ఆవుల ప్రసాద్, సర్పంచ్ నిప్పులపల్లి శాంతమ్మ, పలువురు నాయకులు పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలు:ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహారదీక్ష చేసి ప్రాణాలర్పించిన మహనీయుడు పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిదని ఎంపీపీ మార్కపూడి గాంధీ, జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి తెలిపారు. పొట్టిశ్రీరాములు జయంతి సందర్భంగా మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఆయన చిత్ర పటానికి, వాసవి కాలనీలో విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భగా ఎంపీపీ, జెడ్పీటీసీ మాట్లాడారు. మైనింగ్, పూసల కార్పొరేషన్ డైరక్టర్లు బత్తుల రామారావు, చేని కుమారి, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు వూట్ల నాగేశ్వరరావు, గ్రామాధ్యక్షుడు తదితరులు పాల్గొన్నారు. పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ వేల్పుల పద్మకుమారి ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు వేల్పుల రవికుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు రంగిశెట్టి దుర్గాప్రసాద్, బత్తుల వెంకటనర్సు, వార్డు సభ్యులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. కార్యాలయంలో తహసీల్దార్ కె.లక్ష్మీకల్యాణి పొట్టిశ్రీరాములు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్ఐ జనార్ధనరావు, వీఆర్ఓలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వత్సవాయి: ఆర్యవైశ్య సంఘం, వాసవీక్లబ్ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు జయంతి గురువారం నిర్వహించారు. ముందుగా పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు బొగ్గవరపు రాజారావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పలువురు మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు రాష్ట్రం కోసం చేసిన త్యాగాల గురించి వివరించారు. అనంతరం ప్రభుత్వ వైద్యశాలలోని రోగులకు పాలు, రొట్టెలు అందజేశారు. గుర్రం హనుమంతురావు, కేశా ఉపేంద్ర, గుర్రం రమేష్, పోట్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

చిల్లకల్లు(జగ్గయ్యపేట):అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని అంజనా యూత్ ఆధ్వర్యంలో అమరజీవి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించి సేవలను కొనియాడారు. ఏఎస్ఐ శ్రీనివాసరావు, యూత్ అధ్యక్షుడు మల్లికార్జునరావు, ఫిరోజ్ ఖాన్, బాబు, తదితతరులు పాల్గొన్నారు.



కంచికచర్లలో పొట్టి శ్రీరాములు, గాంధీజీ విగ్రహాలకు నివాళులర్పిస్తున్న దృశ్యం

కంచికచర్ల : పెద్దబజార్‌లో పొట్టి శ్రీరాములు జయంతి వైఎస్సార్ సీపీ నాయకుడు దేవరకొండ గురవయ్య ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ముందుగా పొట్టి శ్రీరాములు, గాంధీజీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎం పాండురంగారావు, నారిశెట్టి శ్రీనివాసరావు, జల్లా హనుమంతరావు, కొఠారు పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు. శాఖా గ్రంధాలయంలో పొట్టి శ్రీరాములు, గాంధీజీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంధపాలకుడు చంద్రశేఖరుడు, వెంకటేశ్వరావు, పాఠకులు పాల్గొన్నారు.



జమ్మిచెట్టు సెంటర్‌లో పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న తన్నీరు

జగ్గయ్యపేట అర్బన్: అమరజీవి పొట్టి శ్రీరాములు ఆంధ్ర రాష్ట్రం కోసం చేసిన త్యాగం మరువలేనిదని కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు అన్నారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక జమ్మిచెట్టు సెంటర్‌లోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్రతో కలిసి తన్నీరు నాగేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు ఆశయాలను నేటి యువత స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్‌లు తుమ్మల ప్రభాకర్, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, వాణిజ్య విభాగం అధ్యక్షుడు చారుగుండ్ల కొండ, పట్టణ సచివాలయాల కన్వీనర్ తుమ్మేపల్లి నరేంద్ర, కౌన్సిలర్లు కొలగాని రాము, గింజుపల్లి వెంకట్రావు, మోరె బాబి తదితరులు పాల్గొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో అమర జీవి పొట్టిశ్రీరాములు జయంతి నిర్వహించారు. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, కౌన్సిలర్లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



పొట్టి శ్రీరాముల విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘ నాయకులు



మున్సిపల్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉద్యోగులు



పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

చిన్న రామాలయంలో ప్రత్యేక పూజలు



చిన్న రామాలయంలో పూజలు చేస్తున్న నేతలు

జగ్గయ్యపేట అర్బన్:పట్టణంలోని చెరువు బజారులో నూతనంగా పునర్నిర్మాణం జరిగిన సీతారామ మందిరం (చిన్న రామాలయం)లో ఈ నెల 18 వ తేదీన హనుమత్ సీతారామచంద్ర, లక్ష్మణ స్వామి వార్ల విగ్రహ ప్రతిష్టా మహోత్సవం జరగనున్న దృష్ట్యా వైఎస్సార్ సీపీ నేతలు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, యువజన విభాగం అధ్యక్షుడు ఆవాల భవానీప్రసాద్ తదితరులు స్వామి వార్లకు పూజలు నిర్వహించారు. చిన్న రామాలయం పునర్నిర్మాణానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను టీటీడీ, రాష్ట్ర దేవదాయశాఖ నిధులు నుంచి రూ.10 లక్షలు మంజూరు చేయించారని తెలిపారు. అలాగే ఉదయభాను తన వంతు విరాళంగా ప్రతిష్టా మహోత్సవానికి రూ.2 లక్షలు అందజేశారని, చిట్యాల గ్రామ నాయకుడు మార్నెళ్ల పుల్లారెడ్డి భక్తులకు సొంత ఖర్చుతో అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేసినట్లు చెప్పారు. ఎమ్మెల్యే ఉదయభానుకు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దేవాలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ కఠారి హరిబాబు, దామెర్ల అంజనీప్రసాద్, బాలకోటి తదితరులు పాల్గొన్నారు.

పందుల మృతికి స్వైన్ ఫీవరే కారణం

పశు వైద్యాధికారి అనిల్



అనిల్, పశువైద్యాధికారి

పెనుగంచిప్రోలు: పందుల మృత్యువాతకు స్వైన్ ఫీవర్ అని నిర్ధారణ అయిందని పశువైద్యాధికారి అనిల్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా గ్రామంలో వందల సంఖ్యలో పందులు మృత్యువాత పడుతుండటంతో కారణం తెలుసుకోవటానికి విజయవాడకు చెందిన ప్రాంతీయ పశువ్యాధుల నిర్ధారణ సంస్థ, వెటర్నరీ బయోలాజికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ అధికారులు పందుల నుంచి శాంపిల్స్ సేకరించారన్నారు. వాటిని పరీక్షించి పందుల్లో వైరస్ వల్ల వచ్చే స్వైన్ ఫీవర్ వ్యాధిని గుర్తించారని పేర్కొన్నారు. ఆంత్రాక్స్ అయితే మనుషులకు కూడా సంభవిస్తుందని, పరీక్షల్లో అది నెగటివ్ వచ్చిందని స్పష్టం చేశారు. స్వైన్ ఫీవర్ కేవలం పందుల్లో మాత్రమే వస్తుందన్నారు. మనుషులకు సోకే అవకాశం లేదన్నారు. ఈ వ్యాధి అన్ని వయస్సు పందుల్లో వచ్చే అతి ప్రమాదకరమైనదన్నారు. సోకిన పందులు నీరసించి 2 లేదా మూడు రోజుల్లో మరణిస్తాయన్నారు. ఈవ్యాధి సోకిన పందులను ఆరోగ్యంగా ఉన్న పందుల నుంచి వేరు చేయాలన్నారు. లేనియెడల ఈవైరస్ గాలి, నీరు, ఆహారం, మనుషులు, వాహనాల ద్వారా ఆరోగ్యకరమైన వాటికి కూడా వస్తాయన్నారు. చనిపోయిన పందులను దూరంగా భూమి లోతులో సున్నం వేసి పాతిపెట్టాలన్నారు. పందులు ఉండే ప్రదేశాలను, షెడ్లను బ్లీచింగ్‌తో కడగాలన్నారు. అవి తాగే తొట్టెలను కూడా శుభ్రంగా బ్లీచింగ్‌తో శుభ్రం చేయాలన్నారు. ఆరోగ్యంగా ఉన్న పందులకు స్వైన్ ఫీవర్ వ్యాక్సిన్ వేసి వ్యాధి రాకుండా నివారించుకోవచ్చన్నారు. పందులకు ఇచ్చే ఆహారం, నీరు పరిశుభ్రంగా ఉండేలా పెంపకం దారులు చూసుకోవాలన్నారు.

శనగల కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ కోటేరు లక్ష్మీ నాయకులు

పెద్దాపురం (వీరులపాడు): వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి హరితవిప్లవ సాకారమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారని ఎంపీపీ కోటేరు లక్ష్మీ తెలిపారు. వీరులపాడు మండలం పెద్దాపురం గ్రామంలో వ్యవసాయ సహకార పరపతి సంఘంలో నూతనంగా ఏర్పాటు చేసిన శనగల కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయాన్ని పండుగ చేసేలా పాలన సాగిస్తున్నారని చెప్పారు. అన్నదాతల సంక్షేమం, శ్రేయస్సే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమని పేర్కొన్నారు. రైతులు దళారులు, ప్రైవేట్ వ్యాపారుల బారిన పడి నష్టపోకుండా మద్దతు ధర కల్పించి రైతుకు మంచి చేసేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిందని పేర్కొన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. క్వింటాకు మద్దతు ధర రూ.5335 ప్రకటించారన్నారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆవుల రమేష్ బాబు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, సొసైటీ అధ్యకుడు ఆవుల ప్రసాద్, గ్రామ సర్పంచ్ నిప్పుల పల్లి శాంతమ్మ, ఉప సర్పంచి బవిరిశెట్టి లక్ష్మీ పలువురు నాయకులు పాల్గొన్నారు.

ప్రజలకు పుష్కలంగా తాగునీరు అందిస్తాం

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



రక్షిత మంచి నీటి పథకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్:పట్టణ ప్రజలకు పుష్కలంగా తాగునీరు అందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు తెలిపారు. రూ. 13 లక్షలతో పునరుద్ధరించిన పాత మునేటి మంచి నీటి సరఫరా పథకాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ రోడ్ల విస్తరణలో భాగంగా మంచి నీటి పైప్‌లైన్‌ల లీకేజీల కారణంగా ప్రజలకు సరిపడ తాగునీటిని సరఫరా చేయటంలో కొంత అసౌకర్యం కలుగుతుందని తెలిపారు. ఇకపై ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా పూర్తి స్థాయిలో మంచి నీటిని సరఫరా చేస్తామని పేర్కొన్నారు. వేసవి కాలంలో కూడా తాగు, వాడుక నీటికి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అవసరమైతే ట్యాంకర్‌ల ద్వారా తాగునీటిని సరఫరా చేసేందుకు కూడా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. ఏ వార్డులో ఏ సమయానికి తాగునీటిని సరఫరా చేస్తామో కూడా సమాచారం తెలిపేలా సమాచార వ్యవస్థను రూపొందిస్తున్నామని వెల్లడించారు. ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, నగర పంచాయతీ కమిషనర్ జయరాం, ఏఈ ఫణి శ్రీనివాసరావు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ కన్వీనర్ దొంతిరెడ్డి దేవేందర్ రెడ్డి, కౌన్సిల్ సభ్యులు పాకాలపాటి కిరణ్, యాకుబ్ వలీ, నాయకులు గుడివాడ సాంబశివరావు, దాసు, చిరుమామిళ్ల చైతన్యకుమార్, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అలసత్వం తగదు

సచివాలయాల జిల్లా అధికారి అనురాధ



సమావేశంలో మాట్లాడుతున్న అనురాధ

నందిగామ:గ్రామ,వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న సిబ్బంది విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని జిల్లా సచివాలయాల అధికారి అనురాధ తెలిపారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం నందిగామ, చందర్లపాడు, వీరులపాడు మండలాల్లో పనిచేస్తున్న కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం సచివాలయాల ద్వారా అందిస్తున్న సేవలు ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చూడాలని కోరారు. ముఖ్యంగా ఫీవర్ సర్వే కు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు అధికారులకు తెలియజేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ కూడా ఆధార్ కార్డులలో జిల్లా పేరును మార్చుకునేలా చూడాల్సిన బాధ్యత సిబ్బందిపైనే ఉందన్నారు. సచివాలయాల పరిధిలోని గర్భిణుల వివరాలు సేకరించడంతోపాటు వారి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు ఆరోగ్యశాఖ సిబ్బంది ద్వారా పర్యవేక్షిస్తూ ఉండాలని ఆదేశించారు. విధి నిర్వహణలో బాధ్యతగా వ్యవహరించాలని, సచివాలయానికి వచ్చిన వారితో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలన్నారు. ఇక నుంచి తరచూ సచివాలయాలను ఆకస్మిక తనిఖీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయా సచివాలయాల్లో సిబ్బంది పనితీరు, రికార్డులను పరిశీలించారు. ఎంపీడీవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో సకాలంలో ఇళ్లు పూర్తిచేయాలి



కంచికచర్ల: జగనన్న కాలనీల్లో ఇళ్లను త్వరితగతిన పూర్తి చేస్తే సకాలంలో అధికారులు బిల్లులు చెల్లిస్తారని ఎంపీపీ షేక్ మలక్‌బషీర్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పలు శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వం అర్హతగల లబ్ధిదారులను గుర్తించి ఇళ్ల స్థలంతో పాటు ఇల్లు మంజూరు చేసిందని చెప్పారు. ఇప్పటికే లే అవుట్‌లలో విద్యుత్ సరఫరా, నీటి వసతి, రహదారులు వంటి సదుపాయాలు కల్పిస్తున్నామని చెప్పారు. ముందుగానే ఇళ్లు కట్టుకునే వారికి సిమెంట్, ఇనుము గృహనిర్మాణశాఖ ద్వారా మంజూరు చేశామన్నారు. ఇల్లు కట్టుకునే లబ్ధిదారులకు డ్వాక్రా సంఘం ద్వారా రుణాలు మంజూరు చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే ఇళ్లు పూర్తిచేసుకుని గృహ ప్రవేశాలు కూడా కొంతమంది చేశారని, మిగిలిన వారు త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు వేల్పుల ప్రశాంతి, ఎంపీడీఓ కె. బాలశంకరావు, తహసీల్దార్ వడ్డేశ్వరపు రాజకుమారి, హౌసింగ్ ఏఈ నరసింహారావు, ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు, వీఆర్వోలు, గ్రామ సచివాలయ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

దేశ సైనిక సహాయ నిధికి విరాళం



నందిగామ టౌన్:దేశ సైనిక సహాయ నిధికి మెప్మా సిబ్బంది విరాళమందించటం అభినందనీయమని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. మెప్మా ఆధ్వర్యంలో అందించిన విరాళం చెక్కును గురువారం ఎమ్మెల్యే చేతుల మీదుగా దేశ సైనిక సహాయ నిధికి పంపారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ దేశ రక్షణకు సైనికులు తమ ప్రాణాలను త్యాగం చేస్తున్నారన్నారు. అటువంటి ప్రాణత్యాగానికైనా వెనుకాడని సైనిక సహాయ నిధికి విరాళం అందించటం గొప్ప విషయమని కొనియాడారు. విరాళాన్ని కలెక్టర్ ద్వారా సహాయ నిధికి పంపనున్నట్లు తెలిపారు. ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ కన్వీనర్ దొంతిరెడ్డి దేవేందర్ రెడ్డి, నాయకులు నల్లమల్లి మురళి, చిరుమామిళ్ల చైతన్యకుమార్, పాకాలపాటి కిరణ్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

భూ హక్కు భూ రక్షలో పక్కాగా హద్దులు



కంచికచర్ల: జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంలో భాగంగా భూముల రీ సర్వే చేసామని దీంతో కచ్చితమైన కొలుతలు, హద్దులతో సర్వే హద్దు రాళ్లను పాతుతున్నామని తహసీల్దార్ వడ్డేశ్వరపు రాజకుమారి తెలిపారు. మండలంలోని పరిటాలలో గురువారం రీ సర్వే చేసిన భూముల్లో హద్దురాళ్లను పాతారు. ఈ మేరకు తహసీల్దార్ మాట్లాడుతూ రైతులు పొలానికి భూ హక్కు పత్రంతో హాజరుకావాలని కోరారు. స్టోన్ ప్లాంటేషన్ కార్యక్రమం చేపట్టే సమయంలో రైతులు పట్టాదార్ పాసుపుస్తకాలు తీసుకొచ్చి తమ సిబ్బందికి సహకరించాలని సూచించారు. డెప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ రాజేంద్ర ప్రసాద్, డీటీ నాగుల్‌మీరా, ఆర్ఐ శిరీష, సర్వేయర్ బసవరావు, వీఆర్వోలు శ్రీలక్ష్మీ, వేముల ప్రదక్షిణరావు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ ద్వితీయ పరీక్షలు



కంచికచర్ల: ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండలంలోని మూడు పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులు తెలుగు, సంస్కృతం పరీక్షలు రాసారని కస్టోడియన్ అధికారి సుజిని తెలిపారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 207 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 189 మంది హాజరయ్యారన్నారు. మండలంలోని కీసర బీజేటీ డిగ్రీ కళాశాలలో 274 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 270 మంది హాజరయ్యారని తెలిపారు. కంచికచర్ల ఇమ్మాక్యులేటివ్‌లో 245 మందికి 243 మంది హాజరయ్యారన్నారు. పరీక్షా కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించామని తహసీల్దార్ వడ్డేశ్వరపు రాజకుమారి చెప్పారు. పరీక్షా కేంద్రాలను సీఐ నాగేంద్రకుమార్, ఎస్ఐ సుబ్రహ్మణ్యం పరిశీలించారు.

కుక్కల సమస్య పరిష్కరించాలని వినతి

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలో కుక్కల సమస్య పరిష్కరించాలని ఒకటో వార్డులోని డాంగేనగర్‌కు చెందిన లంకపల్లి రవి ప్రసాద్ గురువారం మున్సిపల్ కమిషనర్ శివకోటేశ్వరరావుకు విన్నవించారు. ఈ మేరకు వినతిపత్రాన్ని అందించారు. పట్టణమంతా అన్ని వార్డుల్లో కుక్కలు తీవ్రంగా ఉన్నాయని తెలిపారు. పాదచారులు, ద్విచక్రవాహనదారులపై కుక్కలు ఎగబడి ఇబ్బంది కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. ఎంతో మందిని కుక్కలు కరిచాయన్నారు.
అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.